నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 1 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## హెచ్ఎం సస్పెన్షన్

వేమనపల్లి, ఫిబ్రవరి 28 : వేమనపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సస్పెన్షన్ చేస్తూ ఉట్నూరు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఆశ్రమ పాఠశాలకు చెందిన 28 క్వింటాళ్ల బియ్యాన్ని కోటపల్లి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి తీసుకున్నట్లు చూపించి.. 18 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రైవేట్ వాహనంలో తరలించడంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. అవకతవకలు జరిగినట్లు తేలడంతో ఆయనను సస్పెన్షన్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా మాధవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## 'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ● ఆసిఫాబాద్‌లో అధికారులతో సమీక్ష

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 28 : మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఇన్‌చార్జి డీఈవో యాదయ్యతో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 36 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 6,779 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**ఉపాధి అవకాశాలు కల్పించాలి**

నిరుద్యోగ యువతకు నైపుణ్యతపై శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం డిమాండ్ ఉన్న రంగాలను ఎంచుకునేలా యువతను ప్రోత్సహించాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద యువతకు శిక్షణ అందించాలని, జిల్లాలో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

**మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాలి**

ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న సిమెంట్ పనులను మార్చి నెలాఖరుకల్లా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బానోత్ దత్తారాంతో కలిసి పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిషనర్ ఉదయ్ బాబు, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, జిల్లా రవాణాశాఖ అధికారి రామ్‌చందర్, డీఎంహెచ్‌వో సీతారాం, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి అశోక్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, పంచాయితీ రాజ్ ఈఈ. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించాలి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 28 : మార్చి 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఇంటర్ బోర్డు కమిషనర్ కృష్ణాదిత్య, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించారు. శాంతికుమారి మాట్లాడుతూ ఇంటర్ వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, దాదాపు 10 వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డేవిడ్, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# అక్రమ నియామకాలపై నోరుమెదపరేమీ?

**నస్పూర్ బల్దియాలో నిబంధనలు ఉల్లంఘించిన కమిషనర్లు**

● ఎలాంటి అనుమతులు లేకుండా 130 మంది నియామకం
● చట్టవిరుద్ధంగా మున్సిపల్ పట్టణ ప్రగతి, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల నుంచి జీతభత్యాలు
● అధికారులపై కానరాని చర్యలు
● మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనంతో ప్రశ్నార్థకంగా కార్మికుల భవితవ్యం

మంచిర్యాల, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన నస్పూర్ బల్దియా అక్రమాలకు కేరాఫ్‌గా నిలిచింది. భవన నిర్మాణం మొదలు.. భారీ వెంచర్ల వరకూ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులివ్వడంవంటివి వివాదాస్పదం కాగా, తాజాగా సర్కారు అనుమతి లేకుండా 130 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించి.. వారికి చట్ట విరుద్ధంగా పట్టణ ప్రగతి, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలిచ్చిన వ్యవహారం వెలుగుచేసింది. ఈ అక్రమాలపై అనేక విమర్శలు వెల్లువెత్తుతుండా, ఉన్నతాధికారులు నోరుమెదపకపోవడం వెనుక ఆంతర్యమేమిటన్న ప్రశ్న తలెత్తుతున్నది.

**అక్రమ నియామకాల లెక్కలివిగో..**

2018, ఆగస్టు 2న సింగపూర్, నస్పూర్, తాళ్లపల్లి, తీగలపహాడ్ నాలుగు గ్రామ పంచాయతీలను కలుపుకొని నస్పూర్ మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. అప్పటికే ఈ నాలుగు గ్రామ పంచాయతీల్లో 121 మంది కార్మికులు ఉన్నారు. క్రమేనా వారికి మరో 9 మందిని కలిపి మొత్తం కార్మికులను 130 మందిని చేశారు. కాకపోతే ఈ 9 మందికి ఎలాంటి మున్సిపల్ తీర్మానం గానీ, సీడీఎంఏ అప్రూవల్‌గాని తీసుకోలేదు. ఇదయ్యాక 2021 కరోనా సమయంలో 56 మంది, వారిని నియమించాక రెండు, మూడు నెలలు ఆగి మరో 20 మందిని ఇలా విడుతల వారీగా మొత్తంగా 86 మందిని కౌన్సిల్ తీర్మానంతో మూడు నెలల పని కోసం నియమించుకున్నారు. కానీ, ఇప్పుడా మూడు నెలలు గడిచి.. నాలుగేళ్లవుతున్నా ఇప్పటికీ వాళ్లను నిబంధనలకు విరుద్ధంగానే కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించాలంటే ముందు మున్సిపాలిటీలో ఫలానా పని కోసం, ఇంత మంది కార్మికులు అవసరం ఉన్నారని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి దాన్ని కలెక్టర్‌కు పంపాలి. కలెక్టర్ నుంచి సీడీఎంఏకు వెళ్తుంది. సీడీఎంఏ ప్రభుత్వ అనుమతి తీసుకొని కలెక్టర్‌కు, మున్సిపాలిటీకి పంపిస్తే ఆ అనుమతుల కాపీని బేస్ చేసుకొని మున్సిపల్ కౌన్సిల్‌లో దాన్ని ఆమోదించుకోవాలి. అది కూడా కొన్ని నెలల పాటు ఏ పనికోసమైతే తీసుకుంటారో, ఆ పని పూర్తయ్యే వరకు తాత్కాలికంగా తీసుకోడానికే వీలుంటుంది. కానీ ఈ విధివిధానాలు ఏవీ పాటించకుండా నస్పూర్ మున్సిపల్ కమిషనర్లు 86 మందిని ఎవరికి నచ్చినట్లు వారు నియమించారు. 2024లో మరో 35 మందిని సైతం మున్సిపల్ తీర్మానం చేసి నియమించారు. నస్పూర్ మున్సిపాలిటీ ఏర్పాటైనప్పుడు 9 మంది, 2021 నుంచి ఇప్పటి దాకా 121 మంది మొత్తం కలిపి 130 మంది కార్మికులను అక్రమంగా, ఎలాంటి అనుమతులు, ప్రభుత్వ ఆదేశాలు లేకుండా నియమించారు. చట్టవిరుద్ధంగానే వేతనాల చెల్లింపు..ఇక గవర్నమెంట్ ఆర్డర్ లేకుండా నియమించిన వీరికి చట్టవిరుద్ధంగా జీతభత్యాలు చెల్లించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా మున్సిపాలిటీకి వచ్చే పన్నులు, జనరల్ ఫండ్ నుంచి ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలి. కానీ, నస్పూర్‌లో మాత్రం పట్టణ ప్రగతి నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వేతనాలు ఇచ్చారని, ఇది పూర్తిగా చట్ట విరద్ధమని మున్సిపల్ అధికారులే చెబుతున్నారు. ఇలా ప్రభుత్వ అనుమతి లేకుండా నియమితులైన ఉద్యోగులకు వేతనాలు సైతం సరిగా రావడం లేదు. 121 కార్మికుల్లో 2021లో నియమితులైన 86 మందికి డిసెంబర్ నెల దాకా వేతనాలు వచ్చాయి. జనవరి నెల వేతనం ఇంకా చెల్లించనే లేదు. 2024 నుంచి 2025 వరకు నియమితులైన 35 మంది కార్మికులకు సంబంధించిన వేతనాలు ఏడాది కాలంగా పెండింగ్‌లోనే ఉన్నాయి. జీతాలు లేక కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బంది అవుతుందంటూ కార్మికులు వాపోతున్నారు. ఈ సిబ్బంది ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యం లేదు. మున్సిపాలిటీలో పనులకు కార్మికుల అవసరం ఉంటే చట్టప్రకారం, ప్రభుత్వ అనుమతితో నియామకాలు చేపట్టాలి. కానీ నస్పూర్ మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లు ఇవేవి పాటించకుండా ఇష్టారీతిన నియామకాలు చేయడంతో పని చేస్తున్న కార్మికులు అవస్థలు పడాల్సి వస్తున్నది. ఇప్పటికైనా కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించి నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇన్ని రోజులు నస్పూర్ మున్సిపాలిటీనే నమ్ముకొని పని చేసిన కార్మికులు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీన అనంతరం ఇబ్బందులు పడకుండా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా చట్టబద్ధత కల్పించాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.



నస్పూర్ మున్సిపల్ కార్యాలయం



చెలిమెల ప్రాజెక్టు

# కాలువలిట్లా.. పంటలెట్లా..?

**చెలిమెల ప్రాజెక్టు నిర్వహణ అస్తవ్యస్తం**

● పిచ్చిమొక్కలతో నిండి నీరందించలేని దుస్థితిలో కాలువలు
● యాసంగిపై ఆశలు వదులుకుంటున్న రైతులు
● పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
● కేసీఆర్ సర్కారులో రంది లేకుండేనన్న అన్నదాతలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 28 (నమస్తే తెలంగాణ) : తిర్యాణి మండల కేంద్రం సమీపంలోని చెలిమెల (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టు కాలువలు పిచ్చిమొక్కలతో నిండి నీరందించలేని దుస్థితి నెలకొనగా, రైతాంగం యాసంగిపై ఆశలు వదులుకుంటున్నది. ప్రాజెక్టు, కాలువల నిర్వహణ సరిగా లేక పంటలు నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఇకనైనా సర్కారు సకాలంలో స్పందించి సాగు నీరందించాలని వేడుకుంటున్నది.

**ఈసారి 80 ఎకరాలే..**

ప్రాజెక్టు కింద యేటా యాసంగిలో దాదాపు 200 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, ఈ యాసంగిలో మాత్రం 80 ఎకరాలే వేశారు. ప్రస్తుత ప్రభుత్వ పట్టింపులేని తనంతో ఆ 80 ఎకరాలకు కూడా నీరందించలేని పరిస్థితి ఉన్నది. కనీసం మోటర్ల ద్వారనైనా పంటలు కాపాడుకుందామంటే కరెంటు సరిగా ఉండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కేసీఆర్ సర్కారులో..**

చెలిమెల వాగుపై 1985లో అప్పటి సర్కారు రూ. 120 కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. తిర్యాణితో పాటు పలు గ్రామాల పరిధిలో సుమారు 6 వేల ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 1998 వరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసిన అధికారులు ప్రధాన కాలువలను మాత్రం వదిలేశారు. ప్రాజెక్టులో నీరున్నా పంటలకు అందని పరిస్థితి. ఇక తెలంగాణ రాష్ట్రం వచ్చి.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత చెలిమెల వాగు ప్రాజెక్టును పునరుద్ధరించి.. కాలువల నిర్మాణానికి నిధులు కేటాయించారు. పనులు పూర్తి చేయించారు. గత సర్కారులో రెండు పంటలకు సరిపడా నీరందించగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పుణ్యమాని పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి చెలిమెల ప్రాజెక్టు కాలువలను ఉపయోగంలోకి తెచ్చి తమను ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిన చెలిమెల ప్రాజెక్టు కాలువ

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోకి సీఎండీ

**42 మందితో కలిసి సొరంగంలోకి దిగిన బలరామ్**

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 28 : శ్రీశైలం ఎస్ఎల్‌బీసీ (టన్నెల్) సొరంగంలో చిక్కుకున్న 8 మందిని వెలికి తీసే చర్యల్లో సింగరేణి సీఎండీ బలరాం.. రెస్క్యూ సిబ్బందితో కలిసి పాల్గొంటున్నట్లు జీఎం శ్రీనివాస్, డైవీజీఎం అరవిందరావు తెలిపారు. శుక్రవారం శ్రీరాంపూర్‌లో వారు మాట్లాడుతూ రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా సీనియర్ పీవో, 40 మంది ఉద్యోగులు, సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డును ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులో పంపించామన్నారు. సొరంగంలోకి లోకో రైలులో వీరంతా వెళ్లినట్లు తెలిపారు. వారం రోజులుగా రాష్ట్ర, కేంద్ర బృందాలతో కలిసి సహాయ చర్యల్లో సింగరేణి బృందం నిమగ్నమైందని తెలిపారు. రామగుండం రెస్క్యూ కేంద్రం ద్వారా బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, ఆర్జీ-1, 2,3ల నుంచి 200 మంది పాల్గొంటున్నారని, సీఎండీ బలరాం 24 గంటల పాటు వారితోనే ఉంటూ సహాయక చర్యలకు నాయకత్వం వహించడం హర్షించదగినదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూజీఎం సత్యనారాయణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్‌రావు, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, పీవోలు వెంకటేశ్వర్‌రెడ్డి, డీవైజీఎం చిరంజీవులు, ఆనంద్‌కుమార్, రవీంద్, మల్లయ్య, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎల్‌బీసీ సొరంగంలో రెస్క్యూ సిబ్బందితో సింగరేణి సీఎండీ బలరామ్

## తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

హాజీపూర్, ఫిబ్రవరి 28 : వేసవిలో ప్రజలకు తాగు నీటికి ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ముల్కల్ల, వేంపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న అమృత్ 2.0 పైప్‌లైన్ పనులను ప్రజారోగ్య శాఖ- మున్సిపల్ ఇంజినీర్ డీఈఈ మధుకర్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగు నీరందించాలని, పైప్‌లైన్ లీకేజీలు, నీటి ట్యాంక్‌ల మరమ్మతులను సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి ప్రాంతాలకు ఈ పథకం ద్వారా తాగు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారి అనిల్ తదితరులు ఉన్నారు.



పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్